క్లుప్తంగా

పంటల పరిశీలన



గంగాధర: మండలంలోని కాసారం, పోతుగంటిపల్లి, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారి రాజుతో కలిసి వరిపంటలను పరిశీలించారు. వరిలో జింకు లోపం, కాండం తొలుచు పురుగు, సల్ఫైడ్ ప్రభావం ఉన్న పొలాలను గుర్తించి నివారణ చర్యలను రైతులకు సూచించారు. వెంట ఏఈవోలు అనంతరాజు, గోపిచంద్, వంశీ, రైతులు ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



హుజూరాబాద్‌రూరల్: ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన బల్మూరి వెంకట్‌ను బుధవారం హుజూరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు సొల్లు బాబు, ఎండీ అప్సర్, జక్కుల రమేశ్, రామకృష్ణారెడ్డి, చాంద్‌పాషా, ప్రణయ్, విజేందర్, విజయ్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం



జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని శ్రీవిశ్వేశ్వరస్వామి(బొమ్మల గుడి) శివాలయంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రమాణ స్వీకారం పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం, మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గాలో ఎండీ సలీం పాషా, కసుబోజుల వెంకన్న, అరుకాల వీరేశలింగం ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించుకున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసిన బల్మూరి వెంకట్ కృషి వెలకట్టలేనిదని, రాబోయే రోజుల్లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వొల్లాల శ్రీనివాస్, చిన్నింటి నాగేంద్ర, పూరెల్ల రాకేశ్, అరుకాల కార్తీక్, పోతుల శ్రీనివాస్, తంగెళ్ల కృష్ణమోహన్, సమ్మయ్య, ప్రవీణ్, కుమార్, సురేశ్, రాచపల్లి రమేశ్, రవీందర్, చాంద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



మానకొండూర్: మండలంలోని దేవంపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్, సీఓఈ బాలుర పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎనిమియాముక్త్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సమతుల ఆహారం తీసుకోవాలని, రక్తహీనత బారిన పడకూడదన్నారు. వైద్య సిబ్బంది క్లెం రమేశ్, ఎమ్ఎల్‌హెచ్‌పీ దివ్యవాణి, ఏఎన్ఎం విజయ, ప్రిన్సిపల్ సునీత, సూపరింటెండెంట్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కరీంనగర్ కార్పొరేషన్: పీసీసీ ఎస్సీ విభాగం సీనియర్ వైస్ చైర్మన్‌గా రామడుగు మండలం వెదిరకు చెందిన వెన్న రాజమల్లయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఎస్సీ విభాగం చైర్మన్ ప్రీతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన రాజమల్లయ్య పార్టీలో మండలం నుంచి రాష్ట్రస్థాయి వరకు వివిధ పదవులు నిర్వర్తించారు. రాజమల్లయ్య నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన

గంగాధర: మండలంలోని ఒద్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆర్మీలో ఉద్యోగ అవకాశాలు, దేశభక్తి వంటి అంశాలపై ఆర్మీ జవాన్ టి.కుమార్ అవగాహన కల్పించారు. ఆర్మీలో ఉద్యోగం పొందడానికి కావాల్సిన విద్యార్హతలు, శరీరధారుఢ్య పరీక్షలతో పాటు లభించే గౌరవం, ఉద్యోగుల పిల్లలకు లభించే రిజర్వేషన్ల గూర్చి వివరించాడు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏళ్లుగా సాగుతున్న పనులు

- అసంపూర్తిగా కుడికాలువ నిర్మాణం
- యాసంగిలోనైనా పూర్తి చేస్తారా..?



ఎల్లమ్మచెరువు సమీపంలో అసంపూర్తి పనులు



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పనులు

గంగాధర: దేవుడి వరమిచ్చినా పూజారి కరుణించని చందంలా ఉంది నారాయణపూర్ రిజర్వాయర్ కుడికాలువ నిర్మాణ పరిస్థితి. ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు పనులు చేస్తూనే ఉన్నారు. వంతులవారీగా సాగుతున్న పనుల్లో ప్రస్తుతం కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి నుంచి రైల్వేలైన్ వరకు, ఎల్లమ్మ చెరువు సమీపంలో పనులు చేయాల్సి ఉంది. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి వేములవాడ వరకు గ్రావిటీ నిర్మించడంతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లి, వేములవాడ చెరువులను నింపి ఉపకాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపడంతోపాటు పంటల సాగుకు నీరందించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గంగాధర, నారాయణపూర్ జలాశయాలు నింపి ఇక్కడి నుంచి రెండు (కుడి,ఎడమ) ప్రధాన కాలువలు, వాటి కింది ఉపకాలువలు నిర్మించి చెరువులు, కుంటలు నింపి పంటలకు నీరందిస్తారు. రెండు ప్రధాన కాలువలు, వాటికింద ఉపకాలువల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో ఎడమ కాలువ పనులు దాదాపు పూర్తికాగ నాలుగైదు సంవత్సరాల నుంచి ప్రాంత రైతులు రిజర్వాయర్ నీటితో పంటలు సాగు చేసుకుంటున్నారు. కుడికాలువ పనులు మాత్రం పూర్తి కావడం లేదు దీంతో రైతులకు ప్రయోజనం చేకూరడం లేదు.

కుడికాలువ

నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి వేములవాడ చెరువు వరకు 18 కిలోమీటర్ల ప్రధాన కాలువ నిర్మించి స్తంభంపల్లి, వేములవాడ చెరువులకు నీటిని తరలిస్తారు. ప్రధాన కాలువ నుంచి 12 ఉప కాలువలు నిర్మిస్తారు. ఈ పనులు పూర్తయితే వేములవాడ, బోయినపల్లి మండలాలతో పాటు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలాల్లోని పలుగ్రామాలకు సాగు నీరందుతుంది. ప్రస్తుతం గంగాధర చౌరస్తా వరకు ప్రధాన కాలువ నిర్మాణం పూర్తయింది. చౌరస్తా సమీపంలో భూసేకరణకు పలుమార్లు సర్వే నిర్వహించినా సమస్య కొలిక్కిరాకపోవడంతో పనుల్లో జాప్యం జరిగింది. గంగాధర చౌరస్తా నుంచి బోయినపల్లి ప్రధాన రహదారిపై వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. జగిత్యాల ప్రధాన రహదారితో పాటు గంగాధర సమీపంలోని రైల్వేలైన్, ఎల్లమ్మ చెరువు సమీపంలో కాలువ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది.

అసంపూర్తిగా ఉపకాలువలు

నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి వేములవాడ వరకు నిర్మించనున్న ప్రధాన కాలువ పనులు కొంత మేర పూర్తయ్యాయి. సంవత్సరాల క్రితం తవ్విన కాలువ చాలా చోట్ల కూలిపోతోంది. అసంపూర్తి పనులు పూర్తయ్యే వరకు గతంలో తవ్విన కాలువ మరోసారి తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుడికాలువ నుంచి నిర్మించనున్న ఉపకాలువల నిర్మాణానికి మోక్షం లభించడంలేదు. ఉప కాలువల నిర్మాణాలకు వివిధ గ్రామాల్లో ఇప్పటివరకు భూసేకరణ పూర్తికాకపోవడంతో ఉపకాలువల నిర్మాణం సైతం పెండింగ్‌లో ఉంది.

రాజకీయ పార్టీల ఆందోళన

కుడికాలువ పెండింగ్ పనులతో పాటు ఉపకాలువ పనులు వెంటనే పూర్తి చేసి దిగువ ప్రాంత గ్రామాల రైతులకు సాగునీరు అందించాలని, చెరువులు, కుంటలు నింపాలని గతంలో ఆయా రాజకీయ పార్టీలు పలుమార్లు ఆందోళనలు చేపట్టాయి. గతంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతుల ఆధ్వర్యంలో రాస్తారోకోలు నిర్వహించారు. టీడీపీ నాయకులు నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి జిల్లా కేంద్రానికి పాదయాత్ర చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పనులు త్వరగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న కవ్వంపల్లి



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేడిపల్లి

గన్నేరువరం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామ పంచాయతీ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్ కుమ్మరి సంపత్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మార్గం మల్లేశం, నాయకులు సంపతి ఉదయ్, క్లెం మల్లారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగాధర: పల్లెల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని కొండన్నపల్లి గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని, హైమాస్ట్‌లైట్లను ప్రారంభించడంతో పాటు రజకసంఘం భవన పనులను ప్రారంభించారు. బూర్గుపల్లి గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాన్ని, రూ.18 లక్షలతో నిర్మించిన ఆధునిక వైకుంఠధామాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతి ప్రదానం చేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి స్పెల్ విజార్డ్ డ్రామా పోటీలను ఇంగ్లిష్ టీచర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ విడుదు శ్రీనివాస్, హెచ్ఎం సాంబయ్య హాజరై మాట్లాడారు. పోటీల్లో విద్యార్థులు చక్కటి ప్రావీణ్యం కనబరిచారని, బహుమతులు ప్రదానం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంగిశెట్టిజగదీశ్వర్, ఉపాధ్యాయులు సీహెచ్. వేణు, పద్మ నాగరాణి, సత్యం,కిషన్ ,సదానందరెడ్డి,వేణుగోపాలచార్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపిక

మండలంలోని మల్యాల జెడ్పీహెచ్ఎస్ విద్యా ర్థులు ఆంగ్ల భాష టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా)ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి స్పెషల్ విజార్డ్, డ్రామా కాంపిటీషన్‌లో భాగంగా మొబైల్ ఓవర్ యూసేజ్ అనే అంశంపై ప్రదర్శించబడిన నాటకం మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. విజేతలుగా నిలిచిన విద్యార్థులను మండల విద్యాధికారి విడుదు శ్రీనివాస్ అభినందించారు. పాఠశాలకు చెందిన అభిలాశ్ పోటీల్లో మండల స్థాయిలో ద్వితీయస్థానం సాధించాడు. కార్యక్రమంలో హెచ్ఎం రాములు, టీచర్లు విజేందర్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, సరోజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన మల్యాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

‘కేసీఆర్ కుట్రలు సాగనివ్వం’

హుజూరాబాద్‌రూరల్: తెలంగాణ జనసమితి, తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండ రాం శాసనమండలి ఎన్నికను అడ్డుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని, ఆయన కుట్రలను సాగనివ్వమని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు అన్నారు. బుధవారం మాట్లాడుతూ కోదండరాంపై కుట్రలు కొత్త కాదని తొమ్మిదేళ్లుగా అనేక రకాల దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కోదండరాం పోటీ చేస్తే కోట్లు ఖర్చుపెట్టి ఓడించారని, ఉద్యమకారులపై కుట్రలు, నిర్బంధాలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ఉద్యమకారులు వ్యతిరేకించాలన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో భూమిని ఆక్రమించారని ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం తహసీల్దార్ అనుపమ క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. చిగురుమామిడి మండలం రేకొండకు చెందిన ఏరుకొండ శ్రీలత మొలంగూర్ శివారులోని 718 సర్వేనంబర్‌లో 150 చదరపు గజాల భూమిని 2013లో కొనుగోలు చేసింది. ఈస్థలంలో కొంత బాగాన్ని ఆక్రమించి అక్రమంగా గ్రామీణ వైద్యుల సంఘం భవన నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. బుధవారం తహసీల్దార్ అనుపమ పోలీసులతో కలిసి విచారణ చేపట్టారు. సమయానికి ఆర్ఎంపీ వైద్యులు రాకపోవడంతో అధికారులు వెనుదిరి పోయారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న కమిటీ బాధ్యులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రధాన రహదారుల డివైడర్ల మధ్యలో నాటిన కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని కోరుతూ బుధవారం పర్యావరణ పరిరక్షణ కమిటీ బాధ్యులు వేల్పుల ప్రభాకర్, రవీందర్, పసుల స్వామి, మాడుగుల సంధ్య తదితరులు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈమొక్కలు మానవళికి అతి ప్రమాదకరమైనవని, వెంటనే తొలగించాలని కోరారు.

ప్రహరీ కూల్చివేత



జమ్మికుంట: మున్సిపల్ పరిధి ఆరోవార్డు హౌజింగ్ బోర్డు కాలనీలో భూ ఆక్రమణకు పాల్పడి నిర్మించిన ప్రహరీని మున్సిపల్ టీపీవో శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. కాలనీలోని తూడి రవిచందర్‌రెడ్డి ఇంటి పక్కన స్థలాన్ని ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించగా అదే కాలనీకి చెందిన లింగంపల్లి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు టీపీవో, మున్సిపల్ సిబ్బంది ప్రొక్లెయిన్‌తో ప్రహరీని కూల్చి స్థలం స్వాధీనం చేసుకొని ప్రభుత్వం స్థలంగా బోర్డు ఏర్పాటు చేశారు.

విద్యార్థులు టాస్క్‌ను సద్వినియోగంచేసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు ఉద్యోగ నియామకాలు చేపడుతున్న టాస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ మేనేజర్, కోఆర్డినేటర్ గంగాప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ హనుమకుమార్ అధ్యక్షతన ప్రాంగణ నియామకాలు అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ ప్రవీణ్ మాధురి, కళాశాల టాస్క్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తాళ్లపల్లి అజయ్ తదితరులు ఉన్నారు.

- కరపత్రాల పంపిణీ కలకలం

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే మున్సిపల్ అధికారులు పక్కదారి పట్టిస్తూ అక్రమార్కులకు, భూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తు మాజీ వార్డు సభ్యుడు తూడి రవిచంద్రబాబు బుధవారం రాత్రి ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ కరపత్రాల పంపిణీ పట్టణంలో కలకలం రేపింది. కాలనీలో ఓ ప్రభుత్వ ఉద్యోగి 33 ఫీట్ల రోడ్డు ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం,మరో వ్యక్తి జిమ్ సమీపంలో స్థలాన్ని ఆక్రమించుకొని బిల్డింగ్ నిర్మాణం చేసిన మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇంటి పక్కన స్థలాన్ని వాడుకుంటున్న క్రమంలో స్వాధీనం చేసుకున్నట్లు బోర్డు పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారని అధికారుల తీరును తప్పుపట్టారు. అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని, కేసులు పెడుతూ,పెద్ద ఎత్తున కుట్రలు పన్నుతున్నారని, ఏది ఏమైనా హౌజింగ్ బోర్డు అక్రమాలపై పోరాడుతానని, ఆమరణ నిరా హార దీక్షకు సిద్ధమేనని కరపత్రాల పంపిణీలో పేర్కొన్నారు.

రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదు



మానకొండూర్: సర్పంచులతో మాజీ ఎంపీ వినోద్



తిమ్మాపూర్: సర్పంచ్‌ను అభినందిస్తున్న గ్రామస్తులు

మానకొండూర్: రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదని, ఆరోగ్యంగా ఉన్నన్ని రోజులు చురుగ్గా పాల్గొనాలని కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సర్పంచ్‌ల పదవీకాలం ముగింపు సందర్భంగా జడ్పీటీసీ శేఖర్ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో సర్పంచ్‌లు చేసిన సేవలు అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను నెరవేర్చేవరకు పోరాటం చేయాలన్నారు. అనంతరం సర్పంచ్‌లను వినోద్‌కుమార్ శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేసి పంచాయతీ పాలకవర్గాలను సన్మానించారు. అనంతరం జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఐదేళ్ల సహకరించిన ప్రజలు, అధికారులకు పలువురు సర్పంచులు ధన్యవాదాలు తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని మాజీ సర్పంచ్, కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దేవునూరి కిష్టయ్య సన్మానించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: ప్రజలు, పంచాయతీ పాలకవర్గం, అధికారుల సమష్టి కృషితో వెలిచాల ఆదర్శ గ్రామంగా నిలిచిందని రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు అన్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయస్థాయిలో రెండు సార్లు ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు సాధించిన ఘనత వెలిచాల గ్రామానికి దక్కిందన్నారు. అభివృద్ధికి సహకరించిన అందరికి సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు ధన్యావాదాలు తెలియజేశారు. సర్పంచ్, ఉపసర్పంచ్ పూదరి వెంకటేశ్, పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్ రావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు శుక్రుద్దీన్, జిల్లా రైతుబంధు కమిటీ సభ్యుడు వీర్ల సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని ఎల్బాకలో కోఆప్షన్ సభ్యుడు పొన్నాల అనిల్, దేశాయిపల్లిలో సర్పంచ్ గాలేటి జ్యోతి, కొండపాకలో సర్పంచ్ ఆవాల అరుంధతిగిరిబాబుని గ్రామస్తులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఐదేళ్లు గ్రామ అభివృద్ధికి పాటు పడ్డామని, సహకరించిన ప్రజలు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుకతిరుపతిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్, సర్పంచ్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రామడుగు: మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు



వీణవంక:ఎల్బాకలో సన్మానిస్తున్న గ్రామస్తులు

విద్యుత్ బిల్లులు చెల్లించొద్దు

హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

వీణవంక: 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించేవారు సంబంధిత బిల్లులు చెల్లించొద్దని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. అధికారులు వేధిస్తే సీఎం మాట్లాడిన వీడియో చూపించాలని సూచించారు. వీణవంక మండలంలోని దేశాయిపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ గాలేటి జ్యోతితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ బిల్లులు చెల్లించొద్దని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ప్రజలకు ఇచ్చిన ఆ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ కృషి చేశారని, గ్రామ పంచాయతీల నూతన భవనాలకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటానన్నారు. అనంతరం సర్పంచ్‌ను సన్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాడ సాదవరెడ్డి, సంపత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలాభివృద్ధి

హుజూరాబాద్‌రూరల్: బీఆర్ఎస్ హయాంలో గ్రామలాభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాజాపల్లి గ్రామంలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ చింత సరితతో కలిసి ప్రారంభించారు. ప్రతి గ్రామ పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని, బీఆర్ఎస్ పాలనలో పల్లెలు అన్ని రంగాల్లో పరుగులు పెట్టి అవార్డులు సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం సర్పంచ్‌ల పదవీకాలం చివరి రోజు కావడంతో సర్పంచ్‌ను శాలువాతో సత్కరించారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామపంచాయతీల్లో సర్పంచుల వీడ్కోలు కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రామారపు వెంకటేశ్

జమ్మికుంట: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను ప్రభుత్వం వెంటే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్‌డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, సంక్షేమ హాస్టల్, పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలని, మెస్‌చార్జీలు పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్, నాయకులు హరీశ్, శంకర్, కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట: బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గూడెపు వంశీకృష్ణ కొత్త ఇంటి నిర్మాణం చేసుకుంటుండగా అదే కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడి, డబ్బులు డిమాండ్ చేశారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

జాతర స్థలాన్ని పరిశీలించిన అధికారులు

శంకరపట్నం: మండల కేంద్రంలో నిర్వహించే సమ్మక్క, సారలమ్మ జాతర ప్రాంగణాన్ని బుధవారం అధికారులు పరిశీలించారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఎంపీడీఓ ఆలయ ఈఓకు సూచించారు. అధికారులు మారుతీరావు, ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ బషీరొద్దీన్, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జాతర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.